సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 5 । జూన్ । 2025



స్పోర్ట్స్ హబ్‌గా చేస్తాం

తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు.

వివరాలు 12లో ▸



పుంజుకున్న ఉల్లి ధరలు

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉల్లి ధర కాస్త పెరిగి క్వింటా రూ.2 వేలకు చేరింది.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.6 /22.4

ఉదయం, మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు సీనియర్ సిటిజన్స్ ఫోరం ఎన్నికలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేవడుతున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఉదయం పది గంటలకు స్థానిక మెట్టుగడ్డలోని బీఈడీ కళాశాల ఆవరణలో ఉన్న సర్వశిక్షా అభియాన్ ఆర్వీఎం హాల్ నిర్వహించే ఓటింగ్‌లో అర్హులైన 163 మంది సభ్యులు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం ఒక ప్రకటనలో కోరారు. కాగా, ఈ ఫోరం 2015 జూన్‌లో 15 మంది సభ్యులతో ప్రారంభం కాగా ప్రస్తుతం 407 మంది ఉన్నారు. 2018 ఆగస్టు 5న ఎన్నికైన కార్యవర్గమే ఇప్పటివరకు కొనసాగుతోంది. తిరిగి ఏడేళ్ల తర్వాత ఇప్పుడు ఎన్నికలు జరగనుండటం గమనార్హం.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వయం ఉపాధి కోర్సులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మహబూబ్‌నగర్ ఫస్ట్ – నవరత్నాలు కేంద్రం పర్యవేక్షకులు గుండా మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి ఇక్కడ మూడు నెలల పాటు ఉచితంగా కంప్యూటర్ (ఎంఎస్ ఆఫీస్), ఫ్యాషన్ డిజైనింగ్ – గార్మెంట్ తయారీ, బ్యూటీషియన్, మగ్గం వర్క్‌పై శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు ఫోన్ నం.94404 10459, 94415 65895లలో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకులకు షోకాజ్ నోటీసులు

గద్వాల: నడిగడ్డలో అధికార పార్టీలో నేతల మధ్య ఆధిపత్య పోరు అధిష్టానానికి తీవ్ర తలనొప్పిగా మారింది. ఇది వరకే గద్వాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సరిత వర్గాల మధ్య వైరం నడుస్తోంది. ఈ క్రమంలో ఇటీవల అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిని తీసుకొని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి సరిత ఇంటికి వెళ్లడం కలకలం సృష్టించింది. ఈ క్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఎంపీ మల్లు రవి మధ్య ఉన్న వైషమ్యాలు వీధికెక్కాయి. మల్లురవి ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని స్పందించగా..సర్దుమణిగినట్లయింది. ఈ నేపథ్యంలో తాజాగా సంపత్ వర్గీయులైన యువజన కాంగ్రెస్ నాయకులకు బుధవారం రాత్రి అనూహ్యంగా షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గద్వాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోల నర్సింహ, అలంపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వరకుంట్ల గణేష్, గద్వాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేఎంఆర్ యేసు, మానవపాడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాశపోగు శేఖర్‌కు నోటీసులు జారీ చేశారు. తన వర్గీయులకు నోటీసులు ఇవ్వడంపై సంపత్ ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.



‘రెవెన్యూ’ కల ఫలించేనా?

- యన్మన్‌గండ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోనే నవాబుపేట
- అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం శూన్యం
- 30 ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు

- వివరాలు 13లో..

పల్లెల్లో ఇథనాల్ చిచ్చు

ఫ్యాక్టరీ వద్దంటూ గ్రామస్తుల ఆందోళన



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దకు కర్రలతో వచ్చిన పెద్దధన్వాడ గ్రామస్తులు

- పరిశ్రమకు సంబంధించి కంటైనర్, టెంట్లు, షెడ్లకు నిప్పు..వాహనాలు ధ్వంసం
- పచ్చని పల్లెల్లో చిచ్చుపెట్టొద్దంటూ ఆగ్రహం
- రాజోళి మండలం పెద్ద ధన్వాడలో తీవ్ర ఉద్రిక్తత

రాజోళి/మానవపాడు: ‘12 గ్రామాలకు ఇబ్బందిగా మారిన ఈ ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దు.. పచ్చని పల్లెల్లో ఫ్యాక్టరీ చిచ్చు పెట్టొద్దు.. ఈ విషయం ఎన్నో సార్లు ఫ్యాక్టరీ వారికి చెప్పాం.. శాంతియుతంగా నిరసన దీక్షలు చేపట్టాం.. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులకు విన్నవించాం.. అయినా మా మాట లెక్కచేయకుండా పనులు ఎలా ప్రారంభిస్తారు’ అంటూ సహనం కోల్పోయిన స్థానికులు సదరు ఫ్యాక్టరీకి సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేశారు. సామగ్రితో వచ్చిన కంటైనర్‌తో పాటు అక్కడ ఏర్పాటు చేసిన టెంట్లు, షెడ్లకు నిప్పు పెట్టారు. ఇతర వాహనాలను ధ్వంసం చేశారు. గతేడాది అక్టోబర్ నుంచి శాంతియుతంగా కొనసాగుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక నిరసన కాస్తా.. బుధవారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.

గతేడాది అక్టోబర్ నుంచి రిలే దీక్షలు..

జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్దధన్వాడలో 27.5 ఎకరాల భూమిని గాయిత్రి ఇథనాల్ ఫ్యూయల్స్ ఫ్యాక్టరీ కొనుగోలు చేసింది. అక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారనే విషయం అప్పటి వరకు ఎవరికీ తెలియదు. గతేడాది అక్టోబర్‌లో ఫ్యాక్టరీ యాజమాన్యం అక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా గ్రామస్తులు కొన్ని రోజుల తర్వాత, ఇతర గ్రామాలతో కలిసి ఫ్యాక్టరీ ఏర్పాట్లుకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో తమకు ఇబ్బంది కలుగుతుందని చుట్టు పక్కల 12 గ్రామాల ప్రజలతో కలిసి తమ కార్యాచరణను ప్రకటించారు. అందులో భాగంగా నిరసనలు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతులు అందజేశారు. అనంతరం ఈ ఏడాది జనవరి 23న రిలే నిరాహార దీక్షను ప్రారంభించి ఫిబ్రవరి 11న విరమించారు. ఆ సమయంలో అధికార పార్టీ నాయకులు, అధికారులు ఫ్యాక్టరీ విషయంలో తమకు అనుకూలంగా నిర్ణయం వచ్చేలా కృషి చేస్తామని మాట ఇచ్చి తమతో దీక్ష విరమింపచేశారని.. కానీ ప్రస్తుతం పరిస్థితి ఇంతదాకా వచ్చిందని వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పేర్కొన్నారు.

ఫ్యాక్టరీ పనులు ప్రారంభంతో ఆగ్రహం



ఫ్యాక్టరీ వద్ద టెంట్లకు నిప్పపెట్టిన దృశ్యం

ఈ క్రమంలో మంగళవారం ఫ్యాక్టరీ స్థలం వద్దకు సామగ్రితో కూడిన వాహనాలు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకొని ధర్నా చేపట్టగా పోలీసులు కలగజేసుకొని తిప్పిపంపారు. బుధవారం సైతం పనులు కొనసాగడం, పోలీసులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో విషయం తెలుసుకొని అక్కడి సిబ్బందితో గ్రామస్తులు మాట్లాడే క్రమంలో గొడవ మొదలైంది. ఒక్కసారిగా సహనం కోల్పోయిన దాదాపు 400 మంది గ్రామస్తులు కర్రలు, రాళ్లతో మూకుమ్మడిగా ఫ్యాక్టరీకి సంబంధించిన ఆస్తులపై దాడులకు పాల్పడ్డారు. టెంట్లు, షెడ్లు నేలకూల్చి వాటితో పాటు కంటైనర్‌కు నిప్పుపెట్టారు. జేసీబీ, కార్లను ధ్వంసం చేశారు. పలువురికి గాయాలయ్యాయి. చివరికి పోలీసులు గ్రామస్తులను శాంతింపజేసి వెనక్కి పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కాగా.. బుధవారం సాయంత్రం తర్వాత పెద్ద ధన్వాడ చుట్టూ ఉన్న గ్రామాలకు చెందిన 45 మంది రైతులకు పోలీసులు అదుపులోకి తీసుకొని.. మానవపాడు స్టేషన్‌కు తరలించారు. ఆధార్‌కార్డులు, ఫోన్ నంబర్లను తీసుకొని రాత్రి 10 గంటల తర్వాత 35 మంది రైతులను పోలీసులు వదిలేశారు. మిగిలిన పది మంది ఇంకా వారి అదుపులోనే ఉన్నట్లు తెలుస్తోంది.

అమాయక రైతులపై అక్రమ కేసులు పెడతారా?

వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించే అమాయక రైతులపై కేసులు పెట్టడం తగదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఇథనాల్ కంపెనీ ఘటనలో అరెస్టు చేసిన రైతులను మానవపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ వద్దని చెబితే రైతులను తీసుకొచ్చి అక్రమంగా కేసులు నమోదు చేస్తారా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పెద్ద ధన్వాడలో జరిగిన ఘటనలో రైతులకు దెబ్బలు తగిలాయని చెప్పారు. రైతులకు తగిలిన దెబ్బలను పోలీసులకు చూపుతూ...వారి నిర్లక్ష్యాన్ని దుయ్యబట్టారు. ఫ్యాక్టరీకి కాంగ్రెస్ ప్రభుత్వం తొత్తుగా మారిందని, అందుకే రైతులపై దాడులు చేయిస్తోందని విమర్శించారు. మండలంలో 45 మంది రైతులపై అక్రమంగా కేసులు పెట్టారని, వాటిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 12 గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా దానికి ప్రభుత్వం, పోలీసులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



మానవపాడు పోలీస్‌స్టేషన్ వద్ద రైతులకు తగిలిన దెబ్బలను చూపుతున్న ఎమ్మెల్యే విజయుడు

గ్రామస్తులకు గాయాలయ్యాయి



పనులు చేపట్టవద్దని అడగడానికి వెళితే వారు చెప్పిన సమాధానాలు, మాట్లాడిన తీరు వల్ల ఇంతటి పరిస్థితికి దారి తీసింది. ప్రైవేట్ వ్యక్తులు దాడులు చేశారు. అందులో గ్రామస్తులకు గాయాలయ్యాయి. పచ్చని పంటలను దెబ్బతీసే ఫ్యాక్టరీ వద్దని చెబుతుంటే, వారు మాపై దాడులు చేస్తే భవిష్యత్తులో మా పరిస్థితి తలుచుకుంటే భయమేస్తుంది.

– శ్యాం ప్రసాద్, పెద్ద ధన్వాడ

పికెటింగ్ ఏర్పాటు చేశాం

ఫ్యాక్టరీకి సంబంధించిన వారు అన్ని అనుమతులు తెచ్చుకున్నారు. వాటి ఆధారంగా పెద్దధన్వాడలో పనులు చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇలాంటి ఘటన చోటుకుంది. మళ్లీ గ్రామంలో అలజడి రేగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశాం.

– మొగిలయ్య, డీఎస్పీ, గద్వాల

రైతులకు అవగాహన కల్పించాలి



చంద్రాస్‌పల్లి రెవెన్యూ సదస్సులో భూసమస్యల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర

కోయిల్‌కొండ: భూభారతి ద్వారా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. బుధవారం కోయిల్‌కొండ మండలం చంద్రాస్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని, భూసమస్యల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులందరూ పాల్గొనేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తుదారులకు ఏవిధంగా దరఖాస్తు పూరించాలని సూచనలు, సలహాలు అందజేయనున్నట్లు తెలిపారు. అధికారులు స్వీకరించిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అదే గ్రామంలో పల్లె దవాఖానాను కలెక్టరతనిఖీ.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత ఉన్న మహిళలపై ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజాగణేష్, తదితరులు ఉన్నారు.

రేపు డిప్యూటీ సీఎం పర్యటన



మూసాపేటలో డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: మూసాపేట మండలకేంద్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం పర్యటించనున్నారని, దీనిని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కోరారు. మూసాపేటలోని అయ్యప్పగుట్ట పక్కన ఏర్పాటు చేయనున్న 132/33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాల్లోని గ్రామాలకు మంజూరైన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు కూడా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇక్కడే శంకుస్థాపన చేయనుండున వాటికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. సబ్ స్టేషన్ స్థలంలో పాటు బహిరంగ సభ ఏర్పాట్లపై విద్యుత్ శాఖ అధికారులు, పార్టీ నేతలతో చర్చించారు. డిప్యూటీ సీఎం సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలిరావాలని కోరారు. అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నాగిరెడ్డి, బాలనర్సిములు, బగ్గి కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, రాంచందర్, ఎస్‌టీగౌడ్, కృష్ణయ్య, రవి, సుధాకర్ ఉన్నారు.

కొనసాగుతున్న ‘స్వచ్ఛత’ కార్యక్రమాలు



వడ్డెరబస్తీలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ లో భాగంగా నగరంలో ఈనెల 2 నుంచి ముమ్మరంగా ‘స్వచ్ఛత’ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకే తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఓపెన్ ప్లాట్ల లో చెత్తాచెదారం ఉంటే తొలగించి ఆ వెంటనే యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. అలాగే ఆయా డివిజన్ల పరిధిలోని వివిధ దుకాణాల వద్ద నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు అమ్మవద్దని స్టిక్కర్లు అంటిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.వేయి నుంచి రూ.పది వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమీత్‌రాజ్‌తో పాటు జవాన్లు పాల్గొంటున్నారు.

పాలమూరుపై కక్షగట్టిన పాలకులు

- ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటు, సాగునీటి తరలింపుతో అన్యాయం
- ప్రజావ్యతిరేక విధానాలను విరమించుకోవాలి
- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి



మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సాగునీటిని ఇతర జిల్లాలకు తరలించడం, ఇథనాల్ కంపెనీలను పెట్టించి ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న తీరును చూస్తుంటే.. పాలకులు కక్ష గట్టినట్టుగా ఉందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి విమర్శించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని అయిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టుకు నీరు తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాకు దక్కాల్సిన నీటిని డిండికి తరలించుకుపోతుంటే ఇక్కడి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు పట్టనట్టుగా ఉండటం దారుణమన్నారు. ఈ పరిణామాలు జిల్లా ప్రజలు బతుకనిచ్చేలా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి తరలింపు చర్యలను ఆపకపోతే మరో పోరాటం చేస్తామన్నారు. అదే విధగా వ్యవసాయ భూములు, ప్రజల జీవనాన్ని నాశనం చేసే ఇథనాల్ కంపెనీలను పెట్టనిచ్చేది లేదని జిల్లా ప్రజలు, రైతులు పోరాటం చేస్తుండగా.. ప్రభుత్వం మాత్రం బలవంతంగా ఫ్యాక్టరీలు పెట్టాలని చూస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇథనాల్ కంపెనీ పాలసీని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర నది ఒడ్డున టీజీ వెంకటేశ్ విషపూరితమైన కంపెనీ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కంపెనీ ఏర్పాటుతో అలంపూర్ ప్రాంతంతో పాటు కృష్ణానది విషపూరితం అవుతుందన్నారు. బనకచర్ల నుంచి ఆంధ్రాకు గోదావరి నీరు తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రజాప్రతినిధులు ప్రశ్నించకపోవడం దుర్మార్గమన్నారు. చంద్రసాగర్ లిఫ్ట్ ద్వారా అమ్రాబాద్ ప్రాంత రైతులకు సాగు నీటిని అందించాలని కోరారు. సమావేశంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, విజయ్‌కుమార్, తిమ్మప్ప, బాలకృష్ణ, జలీల్ పాషా తదితరులు ఉన్నారు.

విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో డీఈఓ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఏనుగొండ పాఠశాలలో ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను నిర్ణయించే స్థాయికి ఆడపిల్లలు ఎదగాలని, వారి అభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. విద్యార్థినీలు బాల్యవివాహాల బారిన పడకుండా పూర్తిస్థాయిలో అప్రమత్తత వ్యవహరించాలని సూచించారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా వ్యాప్తి చెందుతోందని, విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను విద్యార్థులకు వివరించాల్సిన అవసరం ఉందని, పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే 1098, 181, 100, 1930 వంటి టోల్ ఫ్రీ నంబర్లు ఉపయోగించుకునేలా సూచించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, జీహెచ్‌ఎం అరుణ్‌కుమార్, కోఆర్డినేటర్ మల్లేష్, మిథాలీ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

‘విభజన’ ముసాయిదా ప్రక్రియ షురూ

- కొన్ని మార్పులు, చేర్పులతో ఓ కొలిక్కి వచ్చిన డివిజన్ల పెంపు
- ఒకరోజు ఆలస్యంగా పబ్లికేషన్‌కు ఇచ్చిన మున్సిపల్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల ముసాయిదా ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. కొన్ని మార్పులు, చేర్పులతో ఒకరోజు ఆలస్యంగానైనా టౌన్ ప్లానింగ్ అధికారులు బహిరంగ ప్రకటన ఇస్తున్నారు. దీని ప్రతిని ప్రజాప్రతినిధులకు విడిగా పూర్తి వివరాలతో లేఖలు పంపిస్తున్నారు. అలాగే మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, ముడా కార్యాలయాలలోని నోటీస్ బోర్డులలో ఉంచుతున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 4ననే ఈ ప్రకటన రావాల్సి ఉన్నా.. 49 వార్డుల నుంచి ఏకంగా 60 డివిజన్లకు పెరుగుతున్న నేపథ్యంలో ఎంతో కసరత్తు చేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. కాగా, ఒక్కో డివిజన్‌లో కనిష్ఠంగా 2,900 మంది ఓటర్ల నుంచి గరిష్ఠంగా 3,600 మంది వరకు ఉండనున్నారు. ఈ బహిరంగ ప్రకటనను అనుసరించి ఈనెల 11వ తేదీ వరకు నగర ప్రజలతో పాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే సలహాలు, సూచనలు, ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరించనున్నారు. ఆ తర్వాత ఐదు రోజుల వ్యవధిలో వీటిని పరిష్కరించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా, ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, నారాయణపేట జిల్లాలోని మద్దూరు మున్సిపాలిటీలకు సంబంధించిన వార్డుల విభజన ముసాయిదాను అక్కడి కమిషనర్లు వెంటనే సిద్ధం చేయగలిగారు. ఈ మేరకు బహిరంగ ప్రకటన ఈ నెల 4వ తేదీనే వెలువడటం గమనార్హం.







బాలకేంద్రం ముగింపు ఉత్సవాల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని బాదం రామస్వామి ఆడిటోరియంలో బుధవారం రాత్రి నిర్వహించిన బాలకేంద్రం వేసవి శిక్షణ సాంస్కృతిక శిబిరం ముగింపు ఉత్సవాలు అలరించాయి. చిన్నారులు నెల రోజుల పాటు నేర్చుకున్న సాంస్కృతిక అంశాలను చక్కగా ప్రదర్శించారు. భక్తిగీతాలతో పాటు చిన్నారులు జానపదం, క్లాసికల్ నృత్యాలతో ఆకట్టుకున్నారు. గురుబ్రహ్మ, సిద్ధి వినాయక, పలుకే బంగారం, ఇదిగో భద్రాద్రి, స్వాగతం కృష్ణా, జయ జనార్దన.. తదితర నృత్యాలతో అలరించారు. చిన్నారులు, తల్లిదండ్రులతో ఆడిటోరియం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా డీఈఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి సాంస్కృతిక శిక్షణ శిబిరాలు చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక అంశాల్లో ప్రతిభ చాటాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్, స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు నాయిని భాగన్నగౌడ్, డీకే ఆంజనేయులు, బాల కేంద్రం సూపరింటెండెంట్ రాజేష్ కన్నా, దివ్య, హైందవి, సరోజ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా చేస్తాం

రాష్ట్రంలో ఫిఫా సదరన్ అకాడమీ

- రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి కల అని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి వేస్తున్నట్లు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం మొదటి రాష్ట్రస్థాయి అండర్–23 విభాగం 3 3 పురుషుల, మహిళా అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 3 3 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాలెంజర్ పోటీలు నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పదేళ్లలో క్రీడలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఫుట్‌బాల్ క్రీడాకారుడని, క్రీడాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది రూ.360 కోట్లు, ఈ ఏడాది అధికంగా రూ.460 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి, అకాడమీలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఎన్నో క్రీడల టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 35 ఏళ్ల తర్వాత సంతోష్‌ట్రోఫీతో పాటు సబ్ జూనియర్ హాకీ, ఇటీవల రోయింగ్ పోటీలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ టెన్నిస్ మ్యాచ్‌లు నిర్వహించడానికి డబ్ల్యూటీఓతో చర్చిస్తున్నట్లు వివరించారు. ఫిఫాతో కలిసి గచ్చిబౌలిలో సదరన్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

మహబూబ్‌నగర్ జట్ల శుభారంభం

ఈ టోర్నమెంట్‌లో 18 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు మ్యాచుల్లో మహబూబ్‌నగర్ పురుష, మహిళా జట్లు శుభారంభం చేశాయి. మహబూబ్‌నగర్ పురుషులు 11–1 పాయింట్ల తేడాతో కరీంనగర్‌పై, 13–12 తేడాతో ఖమ్మంపై, జిల్లా మహిళా జట్టు 11–8 పాయింట్ల తేడాతో ఖమ్మంపై, 11–1 తేడాతో కరీంనగర్‌పై విజయాలు నమోదు చేసుకున్నాయి. ఇతర పురుషుల విభాగం మ్యాచుల్లో హైదరాబాద్ 21–10 తో జయశంకర్ భూపాలపల్లిపై, రంగారెడ్డి 22–6 తేడాతో మెదక్‌పై, హైదరాబాద్ 18–11 తేడాతో మెదక్‌పై, హన్మకొండ 16–14తో మహబుబాబాద్‌పై, హైదరాబాద్ 21–12తో నిజామాబాద్‌పై, ఖమ్మం 16–8తో గద్వాలపై, మేడ్చల్ మల్కాజ్‌గిరి 21–8తో నిజామాబాద్‌పై, నల్లగొండ 18–8తో జగిత్యాలపై, రంగారెడ్డి 16–9తో మహబూబ్‌నగర్‌పై, హన్మకొండ 17–9తో కామారెడ్డిపై గెలుపొందాయి. మహిళా విభాగం మ్యాచుల్లో మేడ్చల్ మల్కాజ్‌గిరి 11–10 తో మహబూబ్‌నగర్‌పై, ఖమ్మం 15–2తో కరీంనగర్‌పై, హైదరాబాద్ 2–0 తేడాతో జయశంకర్ భూపాలపల్లిపై, హైదరాబాద్ 21–8తో నిజామాబాద్‌పై విజయం సాధించాయి.

రూ.16 కోట్లతో క్రీడాభివృద్ధి

మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం రూ.16 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు జితేందర్‌రెడ్డి తెలిపారు. ఇండోర్ స్టేడియంలో ఏసీ సౌకర్యం, ఇతర మౌలిక సౌకర్యాలు, సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చేనెలలో ఫుట్‌బాల్ మైదానాలను పరిశీలించేందుకు స్పెయిన్‌కు వెళుతున్నట్లు తెలిపారు. నైపుణ్యం గల కోచ్‌లతో మెరుగైన క్రీడాశిక్షణ అందజేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉండాలన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ కనబరిచేవారు జాతీయ స్థాయి ఎంపికవుతారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృధ్వీశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్, చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, సుబాన్‌జీ, మీర్‌ఖాలెద్ అలీ, ఎండీ.ఇలియాజ్, ఫారుఖ్ ముకర్రం, బాల్‌రాజు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు


మహిళల మహబూబ్‌నగర్–మేడ్చల్ మల్కాజ్‌గిరి మధ్య మ్యాచ్ దృశ్యం

మహబూబ్‌నగర్‌కు హ్యాట్రిక్ విజయం

- అజేయ డబుల్ సెంచరీ చేసిన అబ్దుల్ రాఫె


అబ్దుల్ రాఫే (243నాటౌట్)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లా అండర్–19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో బుధవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 170 పరుగుల తేడాతో గద్వాల జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 360 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే అద్భుతమైన బ్యాటింగ్‌తో అజేయ డబుల్ సెంచరీ చేశాడు. 173 బంతుల్లో 6 సిక్స్‌లు, 31 ఫోర్లతో 243 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కనిష్క్ 62, సోను 23 పరుగులు చేశారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గద్వాల 48.1 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో తల్హ 37, గోపిచంద్ 34 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లు యువన్ ముద్దనూరి 3, అభినవ్ 2, కనిష్క్ 2 వికెట్లు తీశారు.

అండర్–19 లీగ్‌లో నైపుణ్యాన్ని చాటుకోవాలి

అండర్–19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుకోవాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. మహబూబ్‌నగర్–గద్వాల జట్ల మధ్య మ్యాచ్‌ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా గెలుపొందిన మహబూబ్‌నగర్ జట్టును అభినందించారు. ఓడిన వారు గెలుపు కోసం పట్టుదలతో ఆడాలని పిలుపునిచ్చారు. అండర్–19 లీగ్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు ముఖ్తార్, శ్రీనివాసులు, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులతో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు 100మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, ప్రవీణ్, సీనియర్ క్రీడాకారుడు సయ్యద్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

అండర్–13 విభాగం బాల, బాలికలు సింగిల్స్‌లో ఆర్.అభిజీత్, రోహన్ రాఘవ, రిషిక. శ్రీహాస, డబుల్స్‌లో రోహన్ రాఘవ–విగ్నేష్, శ్రేష్ఠ–హేమలత, అండర్–15 విభాగంలో సింగిల్స్‌లో శివశంకర్, వినుథన్‌రెడ్డి, టి.రిషిత, వర్షిని, డబుల్స్‌లో ఆర్.అభిజీత్–వినుథన్‌రెడ్డి, వర్షిని–మీనాక్షి, మిక్స్‌డ్ డబుల్స్‌లో శివశంకర్–వర్షిని, అండర్–17లో సింగిల్స్‌లో ఎస్‌జే.జోయల్, సంతోష్ కుమార్, రిషితా, సర్వఘ్న, డబుల్స్‌లో భీమ్‌చరణ్–అనిరుధ్, అరుణ–మీనాక్షి, మిక్స్‌డ్ డబుల్స్‌లో రాఘవేంద్ర–శ్రీనిధి, అండర్–19లో సింగిల్స్‌లో ఎస్‌జే.జోయల్ ప్రసూన్, సంతోష్‌కుమార్, శ్రీనిధి, రిషిత, డబుల్స్‌లో ఎస్‌జే. జోయల్–సంతోష్‌కుమార్, రిషితా–శ్రీనిధి, సీనియర్ పురుషుల సింగిల్స్‌లో జీషాన్, సుమిత్ కుమార్, మహిళల్లో సైరబాను, వర్ధిని, డబుల్స్‌లో సయ్యద్ ఎజాస్‌అలీ–జీషాన్, సైరబాను–వర్ధిని, మిక్స్‌డ్ డబుల్స్‌లో సయ్యద్ అంజద్–సైరబాను ఎంపికయ్యారు.

క్లుప్తంగా


మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

హన్వాడ: మండలంలోని వేపూర్‌లో ఉరేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాల శిరీష (30)కు భర్త నర్సింలు ఏడు నెలల క్రితం అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. దీంతో ఒంటరిగా జీవిస్తున్న శిరీష తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మరిది సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

బల్మూర్: మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకోని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గోదల్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమాదేవి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదల్ గ్రామానికి చెందిన వెంకటయ్య(40) భార్య లలిత ఏడాది క్రితం అతడిని వదిలి పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుంది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటయ్య మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై మృతుడి సోదరుడు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి దుర్మరణం


శివమల్లేశ్(ఫైల్)

దేవరకద్ర: దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ నాగన్న కథనం ప్రకారం.. వెంకటాయపల్లికి చెందిన శివ మల్లేశ్ (24) బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే విద్యుత్‌ను నిలిపి వేయించారు. అయితే అప్పటికే శివమల్లేశ్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పైనుంచి జారిపడి వృద్ధురాలు మృతి

ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు మేరకు గద్వాల మండలం బీరెల్లికి చెందిన గొల్ల దాయేదమ్మ (65) మంగళవారం వీపనగండ్ల మండలం గోపత్‌దిన్నెకు దేవర నిమిత్తం వెళ్లింది. బుధవారం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా తిమ్మాపురం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడింది. తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి అల్లుడు గొల్ల బీచుపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యం: బాలింత మృతి

- న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యుల ధర్నా


జిల్లా కేంద్రంలో ఆందోళన నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రసవం అనంతరం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలింత మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకోగా.. ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం గ్రామానికి చెందిన వనజ (25) రెండో కాన్పు కోసం ఈ నెల 1న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. మంగళవారం ఉదయం గర్భిణికి ఆపరేషన్ చేయడంతో మగశిశుకు జన్మనిచ్చింది. ఇదే క్రమంలో మహిళ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ప్రైవేటు ఆస్పత్రి నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌కు తరలించడంతో బాలింత మృతి చెందింది. బాలింత మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోవర్ధన్ ధర్నా వద్దకు చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్ మాట్లాడుతూ మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

మాగనూర్: మండలంలో ఓ గ్రామానికి చెందిన మైనర్‌కు బాల్య వివాహం చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. ఓ బాలికకు బుధవారం పెళ్లి చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కు ముందస్తు సమాచారం రావడంతో జిల్లా డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్ ఐసీడీఎస్ అధికారులు బుధవారం మాగనూర్ పోలీసులతో కలిసి వెళ్లి పెళ్లిని అడ్డుకున్నారు. అనంతరం అమ్మాయి కుటుంబ సభ్యులకు బాల్య వివాహం నిషేధ చట్టం గురించి అవగాహన కల్పించారు. అలాగే బాలికను రెస్క్యూ చేసి నారాయణపేట సీడబ్ల్యూసీ ముందు హాజరుపర్చి వారి ఆదేశాల మేరకు బాలసదనంలో చేర్పించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ విజయ్‌కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ విద్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అమ్మక్కతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జడ్చర్లలో అర్ధరాత్రి కారు బీభత్సం

- మద్యం మత్తులో డ్రైవర్
- బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన ప్రాణాపాయం

జడ్చర్ల: స్థానిక సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. ఐపీఎల్‌లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించడంతో సంబరాలు చేసుకున్న కొందరు యువకులు మద్యం తాగి కారులో సిగ్నల్‌గడ్డ నుంచి నేతాజీ చౌరస్తా వైపునకు వెళ్తున్న క్రమంలో రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద అదుపు తప్పి ఆలయం వైపునకు దూసుకొచ్చింది. రోడ్డు పక్కన ఉన్న చెరుకు రసం యంత్రాన్ని ఢీకొట్టడంతో కారు ముందు భాగంతో పాటు యంత్రం పూర్తిగా ధ్వంసమైంది. అయితే కారులో బెలూన్లు తెరుచుకోవడంతో చర్లపల్లి, కావేరమ్మపేటకు చెందిన నలుగురు యువకులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని స్థానికులు తెలిపారు. జేసీబీ సహాయంతో కారును అక్కడి నుంచి తరలించారు. అయితే ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.



ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రాజోలి మండల పరిధిలోని తుమ్మిళ్ల గ్రామానికి చెందిన కుర్వ వెంకటేశ్ ట్రాక్టర్‌పై పనినిమిత్తం ఎర్రవల్లికి బయలుదేరాడు. ఈ క్రమంలో కొట్టం కాలేజీ సమీపంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న ఇటిక్యాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మక్తల్: మండలంలో అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. నర్వ మండలం పెద్దకడ్మూర్ గ్రామంలో ఎరుకలి నర్సింహ తన ఇంట్లో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచి ఉంచాడు. సమాచారం అందుకున్న నర్వ పోలీసులు తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కుర్మయ్య తెలిపారు.

రూ.లక్ష చోరీ.. కేసు నమోదు

మక్తల్: రూ.లక్ష చోరీకి పాల్పడిన ఘటన మక్తల్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. మాగనూర్ మండలం మందిపల్లికి చెందిన కుర్వనాగప్ప బ్యాంకులో ఉన్న నగదు డ్రా చేసుకుని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో నారాయణపేట క్రాసింగ్ దగ్గర ఉన్న ఎచ్‌డీఎఫ్ బ్యాంకు ఎదురుగా ఉన్న ఎస్‌ఆర్‌ఎస్ హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లాడు. భోజనం చేసి చేతులు కడుక్కొని వచ్చే లోగా నగదు సంచి కనిపించలేదు. బాధితుడు డబ్బులు చోరీకి గురైనట్లు గ్రహించి వెంటనే మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలంలోని సీసీ పుటేజీను పరిశీలించారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని తెలిపారు.

బైక్‌ను ఢీ కొట్టిన లారీ.. యువకుడి మృతి


చరణ్ కుమార్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామ సమీపంలో లారీ బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న కొప్పుల చరణ్ కుమార్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. చరణ్ కుమార్ తన ద్విచక్రవాహనంపై పని నిమిత్తం జూపల్లి నుంచి కల్వకుర్తి వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న లారీ తాండ్ర గ్రామ సమీపంలో ఢీకొట్టడంతో చరణ్ తలకు గాయమై అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడి తల్లి నెల క్రితం గుండెపోటుతో మరణించిందని ప్రస్తుతం కుమారుడు కూడా మృతి చెందడంతో జూపల్లి గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

గద్వాల క్రైం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో బుధవారం సాయంత్రం ఓ మహిళ మృతి చెందింది. రూరల్ ఏఎస్‌ఐ వెంకటేశ్వర్రెడ్డి కథనం మేరకు.. మానవపాడు మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన కుర్వ రంగమ్మ(60) గద్వాల మండలంలోని పుదూరు గ్రామానికి తన కుటుంబ సభ్యులను చూసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో తెలిసిన వ్యక్తి బైక్‌పై వెళ్తుంది. గోపాల్‌దిన్నె గ్రామానికి చెందిన ఆనంద్ బైక్‌పై అతి వేగంగా వస్తూ పూడూరు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రంగమ్మకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధితురాలిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఘటనపై మృతురాలి కుమారుడు సుంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పుంజుకున్న ఉల్లి ధరలు

- క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2వేలు
- కనిష్టంగా రూ.1100


దేవరకద్ర మార్కెట్ యార్డులో ఉల్లిని తూకం వేస్తున్న హమాలీలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌లో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు పుంజుకున్నాయి. ప్రస్తుతం సీజన్ తగ్గిపోయి మార్కెట్‌కు తక్కువ మొత్తంలో ఉల్లి అమ్మకానికి వచ్చింది. సీజన్ ప్రారంభం నుంచి గత వారం వరకు ఉల్లి ధర రూ.2వేలు దాటని పరిస్థితి ఉండేది. కానీ మార్కెట్‌కు ఉల్లి బస్తాలు తక్కువగా వస్తుండడంతో క్రమంగా ధరలు పెరుగుతున్నాయి.

జోరుగా కొనుగోళ్లు..

మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి దాదాపు రెండు వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. వ్యాపారులు నిర్వహించన వేలంలో ఉల్లి ధర గరిష్టంగా రూ. 2వేలు, కనిష్టంగా రూ. 1100 వరకు పలికాయి. గత వారంతో పోల్చితే ధరలు స్వల్పంగా పెరిగాయి. గతంలో 50 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ. వెయ్యి, కనిష్టంగా రూ. 600 వరకు విక్రయించారు. చిన్నగా పేడు ఉల్లికి గరిష్టంగా రూ. 750 నుంచి కనిష్టంగా రూ. 250 వరకు ధరలు వచ్చాయి.

ఆర్‌ఎన్‌ఆర్ ధర రూ. 1659

దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం మధ్యాహ్నం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు రూ. 1,659 పలికింది. ప్రస్తుతం ధాన్యం సీజన్ కూడా బాగా తగ్గినందున కేవలం వంద బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

నగదు ఇప్పించాలని ఎస్పీకి ఫిర్యాదు


ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

నాగర్‌కర్నూల్ క్రైం: మొక్కజొన్న కొనుగోలు చేసిన వ్యక్తి నుంచి తమకు నగదు ఇప్పించాలని పలువురు రైతులు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బిజినేపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి నంది వడ్డెమాన్, నల్లవెల్లి, ఖానాపూర్ గ్రామాల్లోని పలువురు రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేశాడు. అయితే మూడు నెలలు అయినా నగదు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దాదాపు 60 మంది రైతులకు రూ. కోటి నగదు ఇవ్వాలని బాధితులు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రానికి 15వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నామన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 16,854 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 68 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 17,987 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.377 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

20,666 ఎంయూ ఉత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో బుధవారం 6 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 3 యూనిట్ల ద్వారా 117 మెగావాట్లు, దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు విద్యుదుత్పత్తిని సాధించామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కలిపి 20.666 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

19,115 క్యూసెక్కుల ప్రవాహం

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేసుల నుంచి మొత్తం 19,115 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 834.6 అడుగుల వద్ద 54.5489 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,325 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 0.584 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 1,218 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.